ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




5 జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 21 మే 2025



త్రివేణి సంగమం వద్ద నవరత్న హారతిస్తున్న కాశీ పండితులు



పుష్కర సరస్వతీ పాహిమాం..

కాళేశ్వరంలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

- ఆరో రోజు 50 వేల మంది పుణ్యస్నానాలు
- స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- కొంత మేరకు తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..
- నిరంతరం పర్యవేక్షిస్తున్న భూపాలపల్లి కలెక్టర్, ఎస్పీ

పుష్కరిణికి సారె సమర్పిస్తున్న భక్తులు

సరస్వతి అమ్మవారి ఆలయంలో పూజలు

నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

7

పుష్కరాల విధులకు వెళ్లి..

వడదెబ్బతో మల్టీపర్పస్ కార్మికుడి మృతి



శ్రీనివాస్(ఫైల్)

కాటారం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలం లోని గంగారం గ్రామపంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న మంథెన శ్రీనివాస్(35)అనే వ్యక్తి కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల విధులకు వెళ్లి వడదెబ్బకు గురై అస్వస్థత పాలై చికిత్స పొందు తూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు, గ్రామస్తు లు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. అధికారుల ఆదేశాల మేరకు శ్రీనివాస్ మిగతా కార్మికులతో కలిసి ఈ నెల 14న కాళేశ్వరం విధులకు వెళ్లాడు. విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఆదివారం ఎండదెబ్బకు గురై నోట్లో నుంచి రక్తంపడి తీవ్ర అస్వస్థత పాలయ్యాడు. అక్కడి అధికారులు స్థానికంగా చికిత్స చేయించగా వైద్యులు పెద్ద ఆస్పత్రికి వెళ్లాలని సూచించగా సోమవారం రాత్రి ఇంటికి వెళ్లడంతో మరోసారి తీవ్ర అస్వస్థతపాలయ్యాడు. అంబులె న్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపా రు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య లత, కుమార్తెలు అక్షయ, అవంతిక, కుమా రుడు హర్షవర్ధన్ ఉన్నారు. పుష్కరాల విధులకు వెళ్లి ఎండదెబ్బకు గురై తీవ్ర అస్వస్థతతో ఎంపీడబ్ల్యూ మంథెన శ్రీనివాస్ మృతి చెందిన విషయా న్ని గంగారం పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాలతో డీపీవో వీరభద్ర య్య గంగారం వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. డీపీవో ఆదేశాల మేరకు కార్యదర్శి కరుణాకర్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల యూని యన్ జిల్లా నాయకులు చిట్యాల శశికుమార్, మెంద మల్లికార్జున్‌రావు, మండల అధ్యక్షుడు పప్పుల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

వడదెబ్బతో 20 మందికిపైగా అస్వస్థత

పీహెచ్‌సీలో ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించి చికిత్స



వడదెబ్బకు గురైన వారికి ఐవీ ఫ్లూయిడ్స్ అందిస్తున్న వైద్యులు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి):సరస్వతీ పుష్కరాలకు వస్తున్న భక్తులకు మండుతున్న ఎండలు చుక్కలు చూపిస్తున్నాయి. మంగళవారం అధిక ఉష్ణోగ్రత ఉండడంతో పలువురు భక్తులు వడదెబ్బకు గురై అస్వస్థత పాలయ్యారు. కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పుష్కరాల ఆరో రోజున ఇన్‌పేషంట్ల తాకిడి నెలకొంది. శిబిరంలో 28మంది ఇన్‌పేషంట్లకు చికిత్సనందించగా వారిలో 20మందికి పైగా వడదె బ్బ, డీ హైడ్రేషన్ సమస్యలతో అడ్మిట్ అయ్యారని డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ తెలిపారు.

కోటగుళ్ల నిర్మాణం అద్భుతం


ఇంటలిజెన్స్ ఐజీ తరుణ్‌జోషి



కోటగుళ్లలోని శిల్పాలను పరిశీలిస్తున్న ఐజీ తరుణ్ జోషి

గణపురం, మే 20(ఆంధ్రజ్యోతి): కాకతీయులు నిర్మించిన కోటగుళ్ల ఆలయం ఎంతో అద్భుతమని ఇంటలిజెన్స్ ఐజీ తరుణ్ జోషి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాకతీయుల కట్టడమైన కోటగుళ్ల ఆలయం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు నాగరాజు ప్రత్యేక స్వాగతం పలికి పూజలు చేశారు. రామప్ప శిల్ప సంపదను పోలిన విధంగా కోటగుళ్ళ శిల్ప సంపద ఉందన్నారు. మరో సారి కుటుంబంతో కలిసి సందర్శిస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీఐలు మల్లేష్, నరేష్, ఎస్సై అశోక్‌లు ఉన్నారు.

కూడళ్లకు కొత్త కళ



1. తాడ్వాయి మండల కేంద్రంలోని మేడారం రోడ్డు జంక్షన్
2. గోవిందరావుపేట మండలం పస్రా- మేడారం రోడ్ కూడలి
3. గోవిందరావు పేట మండలం చల్వాయి లక్నవరం జంక్షన్
4. జంగాలపల్లి రామప్ప రోడ్ కూడలి
5. ములుగు జిల్లా కేంద్రంలో..
6. గట్టమ్మ జంక్షన్

- జంక్షన్‌ల సుందరీకరణపై మంత్రి సీతక్క దృష్టి
- రూ.7.14 కోట్లతో ప్రారంభం కానున్న పనులు
- 11 విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు

ములుగు, మే 20(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని కూడళ్ల సుందరీకరణకు మంత్రి సీతక్క దృష్టి పెట్టారు. మల్లంపల్లి నుంచి మేడారం వర కు 11 జంక్షన్ల వద్ద సుందరీకరణ పను లను చేపట్టేందుకు అధికారులతో కలిసి ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిసింది. పంచా యతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికా రులు బుధవారం జంక్షన్‌ల వద్ద సుం దరీకరణ పనులను చేపట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అక్కడ జిల్లా కు ఐకాన్‌గా మారిన వనదేవతా చిహ్నాల ను మల్లంపల్లి నుంచి మేడారం వరకున్న జంక్షన్లలో 18 రకాల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.

11 కూడళ్ల రూ.7.14 కోట్ల నిధులు

జిల్లాలోని 11 ప్రధాన జంక్షన్ల సుందరీకరణపై మంత్రి సీతక్క దృష్టి సారించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సుందరీకరణ పనులను మొదలు పెట్టనున్నారు. రూ. 7.14 కోట్ల పంచాతీరాజ్ నిధులను వెచ్చించి జిల్లాలోని 11 కూడలీల వద్ద జిల్లా ఐకాన్ మేడారం సమ్మక్క-సారలమ్మల పోరాట ప్రతిమలను ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారి 163 వెంబడి ఉన్న ప్రధాన కూడలీల వద్ద వనదేవతల చరిత్ర ప్రతిమలను ఏర్పాటు చేయనున్నారు.

కూడళ్లలో ఏర్పాటు చేసే విగ్రహాలివే..

ములుగు జిల్లాలోని ములుగు మండలం, గోవిందరావుపేట, తాడ్వా యి, వెంకటాపూర్, మల్లంపల్లి, ఏటూరునాగారం మండలాల ప్రధాన రహదారుల వెంట ప్రకృతిని తలపించేలా 18 విగ్రహాలను ఏర్పాటు చేసేందుక అధికారుల సన్నద్ధమవుతున్నారు. మెదటి విడతగా జిల్లా కేంద్రానికి మొదటగా ఉన్న గట్టమ్మ జంక్షన్ వద్ద వనదేవత పుట్టుకను తలపించేలా ప్రకృతి, పులులు, చేతుల్లో పసిపాప విగ్రహాల ఏర్పాటు, జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసత్రి సమీపంలో గల బండారుపల్లి జంక్షన్ వద్ద ఐ లవ్ ములుగు సింబల్‌ను ఏర్పాటు చేయనున్నారు. బస్టాండ్ సమీపంలో గల అంబేద్కర్ సెంటర్‌లో ప్రకృతి, వన్యప్రాణులు, జలపా తం తలపించేలా డిజైన్, గాంధీ సెంటర్ వద్ద ఆకాశానికి చేయి చాచిన ట్లు పచ్చదనంతో కూడిన ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు. జంగా లపల్లి రామప్ప మొదటి జంక్షన్ వద్ద నంది, ఏనుగు విగ్రహాలను, రెండ వ జంక్షన్ వద్ద చేతిలోడమరుకం, ఇరువైపుల నంది విగ్రహాలను, మూడ వ కూడలి వద్ద రామప్ప కళాశిల్పాల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నా రు. గోవిందరావుపేట మండలంలోని చల్వాయి లక్నవరం జంక్షన్ వద్ద కేబుల్ బ్రిడ్జి ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు. పస్రా మేడారం జంక్షన్ వద్ద వీరవనిత సమ్మక్క దేవత పోరాట స్ఫూర్తికి సూచికగా కడ్గం పట్టుకున్న చేతి ప్రతిమ ఏర్పాటు చేయనున్నారు. తాడ్వా యి మండల కేంద్రంలోని మేడారం జంక్షన్ వద్ద వన దేవత ఎక్కుపెట్టిన బాణం ఆకారంలో ప్రతిమను ఏర్పాటు చేయను న్నారు. మేడారం సమ్మక్క- సారలమ్మల గుడి వద్ద చిలకల గుట్ట రోడ్ జంక్షన్ వద్ద గుట్టలు, అడవీ, వాగులు, పక్షు లు, పూవ్వులు, అందమైన ప్రకృతిని తలపించే లా డిజైన్ ఉండనుంది. రెండో విడుతలో మల్లంపల్లి మండల కేంద్రలోని నర్సరంపేట రోడ్ జంక్షన్ వద్ద అడవి దున్న విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ములుగు మండలం జాకారం ప్రధాన కూడలి వద్ద రోడ్డు భద్రత చిహ్నం ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సమీపలోని బండారుపల్లి క్రాస్ వద్ద పురాతన కాలంనాటి లాంతర్‌ను ఏర్పాటు చేయనున్నారు. వెంకటాపూర్ మండలంలోని రామప్పకు వెళ్లే మార్గం వద్ద సీతాకోకచిలుక ప్రతిమ, గోవిందరావుపేట మండల కేంద్రంలోని దుంపెల్లిగూడెం జంక్షన్ వద్ద బల్లపై కూర్చొని ఉన్న ఏనుగు ప్రతిమను ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయిన పల్లి జంక్షన్ వద్ద ఆదివాసిల జీవన శైలిని తలపించేలా విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. తాడ్వాయి మండలంలోని మేడారం మహా జాతర బస్టాండ్ పై జంక్షన్ వద్ద వనదేవత సమ్మక్క రూపమైన కుంకుమ భరిణెను ఏర్పాటు చేయనున్నారు. ములుగు జిల్లా అభివృద్ధిలో భాగంగా జిల్లాకు ఐకాన్‌గా నిలిచిన వనదేవత విజయ గాథ చిత్రాలను, రామప్ప కళా శిల్పాలను లక్నవరం పర్యాటకాన్ని, ఆదివాసీల జీవనశైలిని ప్రకృతి అందాలను సూచించేలా జిల్లా ప్రధాన కూడలీల వద్ద రూ.7.14 కోట్లతో విగ్రహాలను సుందరంగా రూపు దిద్దేందుకు పక్కా ప్రణాళికలతో అధికారులను సన్నద్ధంచేశారు.

బోట్‌లో తిరుగుతూ కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి):సరస్వతీ పుష్కరాలకు నిత్యం వేలాదిగా తరలివస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చేయాలని అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. త్రివేణి సంగమ అంతర్వాహిణి సరస్వతీ పుష్కరాలకు భక్తుల రాకపై అధికారులకు గతంలో ఉన్న అంచనాలకు మించి భక్త జనసందోహం వెల్లువెత్తుతుండడంతో తగు చర్యలు తీసుకో వడానికి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారు. మంగళవారం ప్రధాన పుష్కర ఘాట్‌తో పాటు త్రివేణిసంగమంలో పుష్కర భక్తుల సమస్యలు, సౌకర్యాలను తెలుసుకోవడానికి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి పలువురు జిల్లా స్థాయి అధికారు లు, సిబ్బందితో కలిసి ఇంజన్ బోట్‌లో నదిలో తిరుగుతూ పర్యవేక్షించారు.



బోట్‌లో పయనిస్తూ పర్యవేక్షణ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆలయం వద్ద డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

కాళేశ్వరం : :సరస్వతీ పుష్కరాలకు పలువురు వీవీఐపీలు, వీఐపీలు వస్తున్న దృష్ట్యా పోలీసులు భద్రతా ఏర్పాట్లలో చిన్న లోపం తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. మంగళవా రం శ్రీకాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం ఎదుట, ఆవరణలో డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. పలు చోట్ల ఉన్న బ్యాగులు, సంచులను డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించింది.

ఉరి వేసుకుని సింగరేణి కార్మికుడి ఆత్మహత్య



గాందె సిద్ధార్థ్

గణపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని సింగరేణి కార్మికుడు ఆత్మహ త్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామప్ప కాలనీలో 42వబ్లాక్‌లో గాందే సిద్ధార్థ్ (37) తన కుటుంబంతో నివాసం ఉంటూ కేటీకే-1 ఇంక్లైన్ గనిలో ట్రామ ర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగి స్తున్నాడు. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రి స్తున్న క్రమంలో చున్నీతో ఉరివేసుకు న్నట్లు తెలిపారు. తెల్లవారుజామున గమ నించిన అతడి భార్య కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. కాగా సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు సిద్ధార్థ్‌కు కూ తురు, కుమారుడు ఉన్నారు.

సమ్మెను వాయిదా వేయడం సబబు కాదు

- టీఎస్ యూఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య



మాట్లాడుతున్న టీఎస్ యుఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టయ్య

కృష్ణకాలనీ, మే 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఉన్న 14 కార్మిక సంఘాలు 20వ తేదీన సమ్మెకు పిలుపునిచ్చి, కేంద్రంతో ఎలాంటి హామీలు తీసుకోకుండా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడం సబబు కాదని టీఎస్ యూఎస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమ్మె వాయిదా వెనుక జాతీయ సంఘాల సమ్మె వాయిదా వెనుక బీజేపీ ప్రభుత్వానికి ఎరోక్షంగా సహకరిస్తున్నాయేమోనని కార్మిక వర్గం గ్రహిస్తుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరుతాత 44 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ చట్టాలను తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేస్తుందన్నా రు. ఎవరి ప్రయోజనాల కోసం దేశ వ్యాప్త సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. చైతన్యవంతులైన సింగరేణి కార్మికులు ఆలోచన చేసి జాతీయ సంఘాల నాయకులను నిలదీయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నీరెటి రాజన్న, సమ్ము రాజన్న, దాసరి జనార్ధన్, ప్రసా దొరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌టీ నిబంధనల మేరకే నిర్వహణ

టీజీ కాస్ట్ సభ్య కార్యదర్శి ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హనుమకొండ కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): భారత శాస్త్ర, సాంకేతిక శాఖ(డీఎస్‌టీ) నిబంధనల మేరకే హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎస్సీ, ఎస్టీసెల్ ప్రాజెక్టు నిర్వహణ జరుగుతుందని, ఇందులో ఎలాంటి అక్రమాలకు తావులేదని టీజీకాస్ట్ సభ్య కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17,18తేదీలలో 'ఆంధజ్యోతి'లో సైన్స్ సెంటర్‌పై ప్రచురితమైన వరుస కథనాల నేపథ్యలో టీజీకాస్ట్ సభ్య కార్యదర్శి ఈ ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. 3 ఏళ్ల కాల వ్యవధికి ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా 10వేల ఎస్సీ కుటుంబాలు, 8వేల ఎస్సీ కుటుంబాలను సర్వే చేశామని, ఆయా కుటుంబాల జీవనోపాధి, విద్య, ఆరోగ్యం సంప్రదాయ కార్యకలాపాలపై సేకరించిన అంశాలను సెస్, టిస్‌లు సర్వే రిపోర్టులు సమర్పించాయన్నారు. డీఎస్‌టీ నిబంధనల ప్రకారమే క్షేత్రస్థాయి సర్వేకు ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న సిబ్బందిని పంపించామన్నారు. ప్రమాద ఖర్చుల చెల్లింపులో ఎలాంటి అవకతవలు జరగలేదన్నారు. మిగిలిన పనులను పూర్తిచేయడంతో పాటు ప్రాజెక్టు కాలపరిమితి పెంపునకు డీఎస్‌టీ జీఓఐను కోరామన్నారు. ప్రాజెక్టు అమలు మొత్తం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రాములు

చెన్నారావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, ట్రైనీ ఎస్సై చిలువేరు రోహిత్ కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన మర్రి రాములు (65) సైకిల్‌పై వెళ్లి పాల బాటిళ్లను ఇచ్చి ఇంటికి వస్తున్నాడు. అదేసమయంలో నర్సంపేట నుంచి నెక్కొండకు వస్తున్న టాటాఏస్ సెంటర్ వద్ద ఎదురుగా ఢీకొట్టింది. సైకిల్‌పై ఉన్న రాములు రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌ను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. రాములుకు భార్య సమ్మక్క, ఒక కుమారుడు రాజు, ఒక కుమార్తె ఉంది. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


రంజిత్

నెక్కొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టకాలుబోడు గ్రామానికి చెందిన బానోత్ రంజిత్ (28) జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ మంగళ వారం తెలిపారు. రంజిత్ తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తు న్నాడు. ఆరు నెలల కిందట రంజిత్ భార్య ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంలో రంజిత్ జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం పిట్టకాలుబోడులో ఉంటున్నాడు. మానసిక ఒత్తిడితో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఈ నెల 18న గడ్డిమందుతాగి ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 19న రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న బానోత్ రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. రంజిత్‌కు 10, 8 ఏళ్లున్న ఇద్దరు కుమారులు ఉన్నారు.


పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు


పరీక్షల తీరును పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

నిరసనల మధ్య పీజీ పరీక్షలు ప్రారంభం

● వాయిదా వేయాలని విద్యార్థుల ఆందోళనలు ● క్యాంపస్‌లో పోలీసుల పహారాతో పరీక్షల నిర్వహణ

కేయూ క్యాంపస్ మే 20, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఎంఎ, ఎంకాం, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల అఖరు సెమిస్టర్ పరీక్షలు రసాభాసా మధ్య ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు కేయూ మొదటి గేటు వద్ద నిరసన ఆందోళనలు చేపట్టారు. నిరసన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకుని వర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం అల్పాహార సమయంలో విద్యార్థులందరూ తమ పరీక్షలను వాయిదా వేయాలని మళ్లీ ఆందోళనకు దిగారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి తమ బాధలను చెబుతామంటూ నిరసనకు దిగిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. పరిపాలన భవనం ఎదుట పోలీసులు మోహరించి విద్యార్థులను అక్కడ నిరసన చేపట్టకుండా అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు వీసీ లాడ్జ్ వద్దకు చేరుకున్నారు. వీసీ రావాలంటూ నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వీసీ ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు నచ్చచెప్పి పరీక్షలు రాయాలని సూచించారు. దీంతో విద్యార్థులు శాంతించారు. పరిపాలన భవనం వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ పాలనమండలి సభ్యులు, లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ బి.సురేశ్‌లాల్ విద్యార్థులకు నచ్చ చెప్పారు.

పరిపాలన భవనం వద్ద స్వల్ప తోపులాట

వర్సిటీలో సోమవారం రాత్రి నుంచి విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు వర్సిటీలో భారీగా మోహరించారు. పరీక్షలు వాయిదా వేయలంటూ విద్యార్థులు.. యథావిధిగా నిర్వహిస్తామని అధికారులు ప్రకటించడంతో వర్సిటీలో తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. మంగళవారం ఉదయమే పరిపాలన భవనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని అక్కడకు వచ్చి నిరసన చేపట్టేందుకు ప్రయత్నించిన విద్యార్థులను అడ్డుకున్నారు. పరిపాలన భవనం ఎదుట మహిళ పోలీసులకు, విద్యార్థులకు మధ్య స్వల్పతోపులాట చోటుచేసుకుంది. విద్యార్థులను పోలీస్ వ్యాన్ ఎక్కించేందుకు ప్రయత్నించగా విద్యార్థులు మూకుమ్మడిగా అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని విద్యార్థులు ఆరోపించారు.

పరీక్షల తీరును పరిశీలించిన వీసీ, రిజిస్ట్రార్

కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన పరీక్షల నిర్వహణతీరును కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్ఎల్ సౌజన్య, క్యాంపస్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మమత పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మూడు రోజుల పాటు జీవవైవిధ్య కార్యక్రమాలు

- రేపటి నుంచి 25వ తేదీవరకు నిర్వహణ
- బైక్ ర్యాలీ, అటవీ ఉత్పత్తుల సంత, పిచ్చుక గూళ్ల పంపిణీ
- 24, 25న అడవిలో బస, నడక

హనుమకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22న బైక్ ర్యాలీని నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఏడబ్ల్యుఎల్ఎస్, వీఎస్ఎస్, గ్రామ భారతి, జనవిజ్ఞాన వేదిక, ప్రేరణ విద్యా వికాస, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో చేపట్టనున్న ఈ ర్యాలీని గురువారం ఉదయం 5.45 గంటలకు సుబేదారిలోని అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమై ధర్మసాగర్ మండలం దేవునూరు ఇనుపరాతి గట్టు అటవీ ప్రాంతం వరకు సుమారు 20 కి.మీ. సాగుతుంది. తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు కొనసాగుతుంది. అలాగే గ్రామ భారతి, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో దేశీ విత్తనాలు, అటవీ ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల సంత ఏర్పాటు ఉంటుంది. పాముల పరిరక్షణపై అవగాహన, జీడబ్ల్యుఎంసీ, డీఆర్‌డీవో కిందటేడు నాటిన మొక్కల ప్రథమ జన్మదినోత్సవం, కొత్త మొక్కలను నాటడం, ప్రేరణ విద్యా వికాస సంస్థ బట్ట సంచులు, చింతగట్టు గోశాల పిచ్చుక గూళ్ల ఉచిత పంపిణీ ఏడబ్ల్యుఎల్ వన్యప్రాణి ఛాయాచిత్ర గ్యాలరీ, అటవీ శాఖ (పరిశోధన) మొక్కల సేంద్రియ, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు, కార్యకర్తలు, ఔత్సాహికులు ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం కోరారు.

మరిన్ని వివరాలకు 8328026266, లేదా 9948609591 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఈనెల 24న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జీవవైవిధ్య దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 సాయంత్రం అడవిలో బస, 25న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు అడవిలో నడక, వన్య సందర్శన నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనడానికి మొదట పేర్లు నమోదు చేసుకున్న 20 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది.


పిల్లల కోసం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదం

నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్‌బాడీ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ చౌరస్తా, మే 20(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్‌బాడీ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లోని నవచేతన బుక్‌హౌస్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల సందర్భంగా పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో మేధో సంపత్తి పెంపొందుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ పుస్తకాలను నిరంతరం చదువుతూ ఉండాలని ఆయన కోరారు. నవచేతన బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ.. జూన్ నెల 10వరకు ఈ పుస్తక ప్రదర్శన కొనసాగడంతోపాటు అన్ని రకాల పుస్తకాలపై 10శాతం నుంచి 30శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ధరలకు అందిస్తుందన్నారు.

ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రకాల పబ్లిషర్స్ రచయితలు, కవులు, రచించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని విద్యా సంస్థలు, మేధావులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అరసం కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, సీపీఐ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నాయకులు ఏదునూరి వెంకట్రాజం, దండు మోహన్, ఎం.డి.ఉస్మాన్‌పాషా, తాండూరి గోపి, పి.కిశోర్‌కుమార్, సిబ్బంది రమేష్, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

దేశసేవకు వెళ్లి.. విగతజీవిగా ఇంటికి..

నర్సంపేటకు చేరిన నాగరాజు భౌతిక కాయం ● కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు


నర్సంపేటలో నాగరాజు భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నర్సంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ సంపంగి నాగరాజు(28) సర్వీస్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా తెలిసింది. కశ్మీర్‌లోని సాంబా జిల్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు తన సర్వీస్ గన్‌తో మూడురోజుల కిందట కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆర్మీ అధికారులు గోప్యంగా ఉంచడంతో కుటుంబసభ్యులకు ఆలస్యంగా సమాచారం అందింది. మంగళవారం ఉదయం 7గంటలకు జవాన్ భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో నర్సంపేటలోని పాకాల రోడ్‌లోని ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. ఆకస్మాత్తుగా నాగరాజు విగతజీవిగా రావడంతో ఆయన అతడి భార్య, తల్లిదండ్రులు విజయ- మల్లయ్య, కుటుంబసభ్యుల రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

కాగా, నర్సంపేటకు చెందిన విజయ - మల్లయ్య దంపతులకు ముగ్గురు (సాయికుమార్, వెంకటేశ్, నాగరాజు) కుమారులు ఉండగా, చిన్నవాడైన నాగరాజు 2016లో బీఎస్ఎఫ్‌లో చేరాడు. ఆయన వివిధ విభాగాల్లోని సెక్టార్లలో 6ఏళ్ల పాటు విధులు నిర్వహించాడు. మూడేళ్లుగా కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, మానసిక ఒత్తిడితో మూడు రోజుల కిందట నాగరాజు సర్వీస్ గన్‌తో కాల్చుకుని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే తమ కుమారుడు మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడితే ఆర్మీ అధికారులు వెంటనే సమాచారం అందించలేదని, కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగరాజు మృతదేహానికి హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకులు నివాళి

నాగరాజు భౌతికకాయంపై కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, ఓర్సు అంజలి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, నాడెం నగేశ్, బానాల శ్రీను నివాళులర్పించారు.

ప్రైవేట్ బస్సుల ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గం


అధ్యక్షుడు లక్కం శ్రీధర్


ప్రధాన కార్యదర్శి అనిల్‌గౌడ్

హనుమకొండ చౌరస్తా, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లక్కం శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల అనిల్‌గౌడ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. మంగళవారం హనుమకొండ చౌరస్తా సమీపంలోని ఏనుగుల గడ్డలో ప్రైవేటు బస్సు అసోసియేషన్ నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చింతలపుడి క్రాంతికుమార్, కోశాధికారిగా అనిశెట్టి శ్యామ్, సభ్యులుగా మార్క కోటేష్, కొత్త కిరణ్‌కుమా ర్, పట్నంశెట్టి శైలేష్ ప్రసాద్, ఎం.డి. ఫిరోజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేటు బస్సులకు పన్ను మినహాయింపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను వివిధ శుభాకార్యాలకు వెళ్లకుండా అరికడుతామని వారు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న బాక్సింగ్ ఎంపికలో 1 జనవరి 2009 నుంచి 31డిసెంబర్ 2010 సంవత్సర మధ్యకాలంలో జన్మించిన వారు పాల్గొనవచ్చునని ఆయన వెల్లడించారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 24న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని రాజేందర్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, పాఠశాల నుంచి జారీచేసిన బోనఫైడ్ సర్టిఫికెట్, జీడబ్ల్యూఎంసీ నుంచి జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రంతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలను వెంట తీసుకొని ఈ నెల 22న డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఉదయం 7గంటలకు రిపోర్టు చే యాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని రాజేందర్ కోరారు.

తినుబండారాలపై తనిఖీలేవీ?

- సోయిలేని ఆహార నియంత్రణ శాఖ అధికారులు
- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న హోటల్ యజమానులు
- అపరిశుభ్రత, కల్తీ ఆహారం తిని రోగాలబారిన ప్రజలు

బాలసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహా నగరంలోని హోటళ్లపై తనిఖీలు కరువై వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆహార పదార్థాల పరిశుభ్రత, కల్తీ నివారణను నియంత్రించాల్సిన అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో వ్యాపారులకు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అతి పెద్ద నగరంగా విరాజిల్లుతున్న వరంగల్ నగరానికి సుదూర గ్రామాల నుంచి వివిధ అవసరాలకు ప్రజలు వేలాదిగా వస్తుంటారు. వారికి ఆకలి వేసినప్పుడు ఆకలి బాధను తీర్చుకోవడానికి హోటళ్లను రోడ్ల వెంట ఆహార పదార్థాలను విక్రయించే వారిని ఆశ్రయిస్తుంటారు. దీంతో నగరవ్యాప్తంగా ఆహార వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారులు లాభాలు ఆర్జించడానికి చవకైన కల్తీ నూనెలు ఆహార దినుసులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ఆహార పదార్థాల తయారీపై నియంత్రణ కొరవడి వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు కొద్ది నెలల కిందట నగరంలోని పేరొందిన హోటళ్లలో జరిపిన ఆకస్మిక దాడుల్లో విస్తూపోయే విషయాలు వెలుగు చూశాయి. కుళ్లిన మాంసం, కాలం చెల్లిన సుగంధ ద్రవ్యాలు, బూజుపట్టిన కూరగాయలు ఆహార పదార్థాల్లో వినియోగించే విషపూరితమైన రంగులు వెలుగు చూశాయి. పైన పటారం, లోన లొటారం అన్న చందంగా ఉన్నాయి. వినియోగదారులకు ఆహార పదార్థాలను వడ్డించే హాల్ అపరిశుభ్రంగా ఉండి వంటశాలలో శుచి శుభ్రత లేకుండా దుర్వాసన రావడం అధికారులు గమనించారు. పేరొందిన పెద్ద హోటళ్లలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మామూలు సాధారణ హోటళ్లలో పరిశుభ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇటీవల నగరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు పలు చోట్ల ఐస్‌క్రీమ్ పార్లర్లపై జరిపిన దాడుల్లో కాలం చెల్లిన ఐస్‌క్రీమ్‌లను కనుగొని కేసులు నమోదు చేశారు. కానీ నగరంలో విధులు నిర్వహించే ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించక పోవడంతో హోటల్ వ్యాపారానికి ఆటంకం లేకుండా పోయింది. నిత్యం ఆహార పదార్థాల తయారీ, అమ్మకాలపై నియంత్రణ కొనసాగించాల్సిన అధికారులకు ఎందుకు సోయి లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

పుష్కర జలాలతో నాగేంద్రుడికి అభిషేకం


మల్లెపూల అలంకరణలో పుష్కర పునీతుడైన నాగేంద్రుడు

గీసుగొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌లో గల సుప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడికి సరస్వతీ పుష్కర వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమంలో అంతర్వాహిణిగా ప్రవహిస్తున్న సరస్వతీ నది జలం, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మల్లెపూలతో అలంకరించి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. పుష్కర పునీతుడైన నాగేంద్రుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి పూజలు చేసి తరించారు. పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, ఆలయకమిటీ చైర్మన్ బాబురావు, రాజేందర్, రమేష్, వీరారావు, భక్తులు పాల్గొన్నారు.



108 సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మేనేజర్ నరేష్

పుష్కరాల్లో విస్తృతంగా 108 సేవలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా భక్తులకు 108 అంబులెన్స్‌లు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. ఈ 108 వాహనాలను భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరంలోని పీహెచ్‌సీ, వీఐపీ పుష్కరఘాట్, గోదావరి ఘాట్, ప్రధాన ఆలయం, తాత్కాలిక బస్టాండ్ వద్ద ఐదు ప్రాంతాల్లో ఏర్పాటుచేసి భక్తులకు అత్యవసర వైద్య సేవలను అందిస్తున్నారు. ఇప్పటివరకు మూడు వందల మంది భక్తులకు 108 అంబులెన్స్ ద్వార అత్యవసర వైద్య సేవలను అందించినట్లు జిల్లా మేనేజర్ నరేష్ తెలిపారు. వైద్య సేవలకు కోసం ఫోన్ రాగా ముందుగా రోగులను పీహెచ్‌సీ తరలించిన అక్కడి నుంచి మహాదేవపూర్ సీహెచ్‌సీకి తరలిస్తున్నారు. ఐదు అంబులెన్స్‌లు, 20మంది సిబ్బందితో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పేర్కొన్నారు. అలాగే మరో ఐదు బైక్ అంబుటెన్స్‌ల ద్వార సుమారు పది వేల మందికి ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్లు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అస్వస్థత

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా ప్రధాన ఘాట్ వద్ద విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోల్‌కు ఛాతిలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అలాగే పుష్కర ఘాట్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురైన విజయవాడకు చెందిన కిష్టమూర్తిని, బాలకృష్ణలను 108 వాహనంలో పీహెచ్‌సీకి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. పుష్కర ఘాట్ వద్ద మధుమితకు ఫిట్స్ రావడంతో అస్వస్థతకులోనై అపస్మారకస్థితిలోవెళ్లడంతో వరంగల్‌ఎంజీఎంకు తరలించారు.



వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన అగ్నిమాపక వాహనం

నాలుగు అగ్నిమాపక శాఖ సేవలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా నాలుగు అగ్నిమాపక వాహనాలను అధికారులు అందుబాటులో ఉంచారు. ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి సేవలందిస్తున్నారు. చెన్నూర్, భూపాలపల్లి, ములుగు, వరంగల్‌కు చెందిన నాలుగు వాహనాలు సరస్వతీ పుష్కర ఘాట్, ఆలయం వద్ద, హెలిప్యాడ్ వద్ద వీటిని అందుబాటులో ఉంచారు. ఏదైనా అగ్నిప్రమాదం లేక విపత్తు సంభవించినప్పుడు సేవలందించనున్నారు. సుమారు వంద మంది సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.



పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానం చేస్తున్న భక్తులు

పుష్కర సరస్వతీ పాహిమాం..

కాళేశ్వరంలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

- ఆరో రోజు 50వేల మంది పుణ్య స్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- కొంత మేరకు తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..
- పర్యవేక్షిస్తున్న భూపాలపల్లి కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నదీ పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివస్తున్నారు. ఆరో రోజైన మంగళవారం దాదాపు 50వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుష్కరాల్లో పలువురు ప్రముఖులు పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఐజీ తరుణ్‌జోషి తదితరులు నదిలో పుణ్య స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..

కాళేశ్వరం పుష్కరానికి వచ్చే భక్తుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. రెండు మూడు రోజులుగా వేలాది మంది భక్తుల రాకపోలతో ట్రాఫిక్‌కు అనే ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రద్దీ లేకపోవడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి. వాహనదారులు పార్కింగ్ స్థల సమీపానికి వెళ్లి దగ్గరలోనే ఉన్న పుష్కరఘాట్‌లో పుణ్య స్నానాలు ఆచరించారు. అలాగే, దర్శనాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న భక్తులకు మంగళవారం కాస్త ఉపశమనం కలిగింది. దర్శనాలకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా సాఫీగా సాగాయి.

కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరేలు పుష్కరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రెండు ఘాట్ల లో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అటు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాకపోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తూ వచ్చారు. అలాగే పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

పనుల పరిశీలన

ప్రధానంగా మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. అదికాకుండా అష్టమి రోజు ప్రయాణాలు చేయడం అరిష్టంగా భావించే సంప్రదాయం ఉండడం వల్ల చాలామంది దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రెండు రోజులుగా రావడం లేదని భావిస్తున్నారు. అయితే గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం.. మూడు రోజుల్లో ఉత్పన్నమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రోలింగ్ చేశారు. భక్తుల రాక వల్ల రోడ్డుపై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను కుమ్మరిస్తూ క్యూరింగ్ చేస్తున్నారు.

నవరత్న హారతి లైవ్

పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్‌లో ప్రతీ రోజూ సాయంత్రం ఇస్తున్న నవరత్న హారతీని లైవ్ ద్వారా ప్రజలు, భక్తులు వీక్షించేందుకు ప్రభుత్వం ఆలోచన చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఆ కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రసారం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. పుష్కరాలు ముగిసేంత వరకు ఈ కార్యక్రమం కొనసాగించనున్నారు.



ముక్తీశ్వరుడి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

స్వల్పంగా పెరిగిన నదీ జలాలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల నదీ జలాలు పెరగడంతో సరస్వతి పుష్కర ఘాట్ (త్రివేణి సంగమం) వద్ద జలకళ సంతరించుకుంది. మూడు రోజులతో పోలిస్తే నదిలో ప్రవాహం పెరిగింది. నదిలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మరింత ప్రవాహం పెరిగే అవకాశం ఉందని పలువురు బావిస్తున్నారు.

అందుబాటులో ఎలక్ట్రికల్ వాహనాలు

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో మూడు ఎలక్ట్రికల్ వాహనాలు(బగ్గీ)లు అందుబాటులోకి వచ్చాయి. ఈ వాహనాల్లో భక్తులను ఆలయం నుంచి పుష్కర ఘాట్ వద్దకు, పుష్కర ఘాట్ నుంచి తాత్కాలిక బస్టాండ్ వరకు ఉచితంగా చేరవస్తున్నారు. ఇందులో ఒక్కసారి పది మంది వరకు వెళ్లే వెసులుబాటు ఉంది. ఉచితంగా ఏర్పాటు చేయడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఎలక్ట్రికల్ వాహనంలో భక్తులను తరలిస్తున్న సిబ్బంది

వైభవంగా త్రివేణి సంగమానికి నవరత్న హారతి



హారతి ఇస్తున్న కాశీ పండితులు

తిలకించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీ కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి 7.20గంటల నుంచి 8గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్న హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని పండితులు నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలు శాఖల అధికారులు, వందలాది మంది భక్తులు తిలకించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హారతి కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నవరత్న హారతిని వీక్షిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు, భక్తులు



విద్యలో రాణించాలని సరస్వతి మాతకు మొక్కుతున్న యువతులు



పుష్కరిణికి వడిబియ్యం, సారె సమర్పిస్తున్న భక్తులు

సంచార బయో టాయిలెట్స్ ఏర్పాటు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాలకు వచ్చే మహిళలకు సౌకర్యార్థం సంచార బయో టాయిలెట్స్‌ను సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వాహనాన్ని ఘాట్ వద్ద ఏర్పాటు చేశారు. దీంతో మహిళలు విరివిగా సంచార బయో టాయిలెట్స్‌ను వినియోగించుకుంటున్నారు. సంచార బయో టాయిలెట్స్ ఏర్పాటుపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సంచార బయో టాయిలెట్ వాహనం

ప్రమాదాలకు ఆస్కారం లేకుండా..

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మోహరించింది. ఇప్పటి వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటన లు చోటు చేసుకోలేదు మిగిలిన రోజుల్లో కూడా ఎలాంటి ఇక్కట్లు లేకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోంది.

దేదీప్యమానంగా..

భద్రకాళి చెరువులో 9 ద్వీపాల సుందరీకరణ

- ఇప్పటికే 9 దిబ్బలపై అభివృద్ధి పనులు పూర్తి
- రూ.3కోట్ల 'కుడా' నిధులతో ద్వీపాల అభివృద్ధి పనులు
- దేశ, విదేశాల పక్షులకు ఆశ్రయం కల్పించేలా చర్యలు
- మూడు మార్గాల గుండా కేబుల్ బ్రిడ్జికి ప్రతిపాదనలు

వరంగల్ కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయాన్ని టూరిజం సర్క్యూట్‌గా తీర్చిది ద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వం కలలను అధికారులు ఆచరణసాధ్యంగా చేసి చూపిస్తున్నారు. ఐల్యాండ్స్‌తో పాటు భద్రకాళి బండ్‌ను అనుసంధానం చేస్తూ చెరువు మధ్యలో ఉన్న పెద్ద ఐల్యాండ్ (రిలాక్స్ జోన్) వద్దకు కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. భద్రకాళి చెరువు నుంచి పూడికతీత పనులు జరుగుతుండగానే కుడా అధికారులు ప్రత్యేక నిధులతో యుద్ధప్రాతిప దికన ఐల్యాండ్ పనులు పూర్తిచేశారు. భద్రకాళి చెరువు మధ్యలో ఐల్యాండ్ ఏర్పాటు చేయాలని 2007 నుంచి ప్రయత్నిస్తుండగా, తాజాగా భద్రకాళి చెరువు సుందరీకణ కోసం నీటిని ఖాళీ చేసి పూడికతీత పనులు చేపట్టడంతో సాకారమవుతోంది.



పక్షులకు ఆశ్రయం.. ప్రజలకు ఆహ్లాదం..

382 ఎకరాల సువిశాల భద్రకాళి చెరువు మధ్యలో ప్రకృతిసిద్ధంగా వెలిసిన ఒక ద్వీపంతో పాటు మరో 8 ద్వీపాలను కృత్రిమంగా తీర్చిదిద్దారు. ఇందుకు గాను ఇప్పటికే రూ.3కోట్ల వరకు ఖర్చు చేసినట్టు కుడా అధికారులు వెల్లడించారు. 3 ఎకరాల్లో ఒక ద్వీపం నిర్మితమై ఉండగా, మరో 8 ద్వీపాలను 5 నుంచి 20గంటల స్థలంలో ఎత్తైన సిబ్బంలను కేంద్రంగా చేసుకుని చెరువు ప్రాంతాన్ని బట్టి 20 నుంచి 30మీటర్ల ఎత్తులో ఐల్యాండ్స్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ద్వీపం తయారు చేయడానికి రూ.30 నుంచి 50 లక్షలు ఖర్చు చేశారు. మొత్తంగా 9 ద్వీపాలను ఏర్పాటు చేసి ఆహ్లాదాన్ని పంచే ప్రయత్నం చేశారు. ద్వీపాలపై ఇతర దేశాల నుంచి దిగుమతి చేసిన ప్రత్యేక గడ్డితో పాటు బిల్వము, జమ్మి, రావి, వేప, మోదుగు, ఉసిరి చెట్లను నాటుతామని తెలిపారు. మరో రూ.50లక్షలతో మొక్కలు కొనుగోలు చేసి వర్షాకాలం ప్రారంభంలో నాటుతారని చెప్పారు. 3 ద్వీపాలకు విద్యుత్ వెలుతురు అలంకరిస్తుండగా మరో 6ద్వీపాలు పూర్తిగా ప్రకృతి పచ్చదనంతో దేశ విదేశాల పక్షులకు ఆవాస కేంద్రంగా రూపొందించనున్నారు.

ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారు..

వరంగల్ నగరం అభివృద్ధితో పాటు భద్రకాళి చెరువు పూడికతీత, ద్వీపాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భద్రకాళి బండ్ నిర్మాణంలో పాటు చెరువు మధ్యలో ఐల్యాండ్స్, పక్షుల పరిరక్షణ, ప్రజల ఆహ్లాదం కోసం ప్రత్యేక ద్వీపాలు ఏర్పాటు చేస్తున్నాం. వర్షాలు కురిసిన తర్వాత ద్వీపాలు ప్రజలకు వీక్షణ కోసం అందుబాటులోకి వస్తాయి. ఇంకా చెరువు మధ్యలోకి వెళ్లేందుకు అధునాతన కేబుల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నాయిని రాజేందర్‌రెడ్డి,
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే


టూరిస్ట్ హబ్

చెరువు మధ్యలో 9 ద్వీపాలు అభివృద్ధి చేసిన అధికారులు.. కేబుల్ బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భద్రకాళి గుడి నుంచి గుట్టకు గుట్ట నుంచి భద్రకాళి బండ్, బండ్ నుంచి మూడు ఐల్యాండ్స్ వద్దకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పలుమార్లు సమీక్షలలో చర్చించినట్టు తెలిసింది. ఈ మేరకు అవిభక్త వరంగల్ జిల్లాలో లక్నవరం తర్వాత అతిపెద్ద కేబుల్ బ్రిడ్జి నిర్మాణం భద్రకాళి చెరువు మధ్యలో నిర్మాణం జరుగనుంది. భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న (రిలాక్స్ జోన్) ఐల్యాండ్ వరకు సుమారు 600 నుంచి 700 మీటర్ల పొడవులో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తే చెరువుతో పాటు ద్వీపప్రాంతమంగా టూరిస్ట్ హబ్‌గా మారు తుందని పలువురు చెప్పుకొస్తున్నారు. అయితే ఐల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు భద్రకాళి దేవాలయం, మాడవీధులు, భద్రకాళిబండ్‌ను అనుసంధానం చేస్తూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే ప్రజలకు, టూరిస్టులకు అనుకూలంగా ఉంటుందని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరి కొన్నిరోజుల్లో భద్రకాళి చెరువు ద్వీపాలు పర్యాటక ప్రాంతాలుగా కనువిందు చేస్తాయి.

కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు ఆహ్లాదకారులు ద్వీపాల వద్దకు బోట్స్ రైడింగ్ ద్వారా వెళ్లి రావచ్చని తెలిపారు.

2005లో ద్వీపం గుర్తింపు

భద్రకాళి చెరువులో గతంలో నీరు ఇంకిపోయిన సమయంలో చెరువు స్వభావం, స్వరూపం కనిపించేది. 2005లో చెరువు మధ్యలో సుమారు 3 నుంచి 5ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ద్వీపాన్ని అప్పటి అధికారులు గుర్తించారు. ద్వీపం దిబ్బను శుభ్రం చేసి తవ్విచూడగా ప్రాచీన శిల్పాలు, ఆయుధ కర్మాగారం ఉన్నట్టు ప్రాచీనకారులు గుర్తించారు. అంతేకాకుండా ఈ ద్వీపంపై ఆదిమానవులు జీవించినట్టు ఆధారాలు లభించినట్టు చెప్పారు. దిబ్బను ద్వీపంగా మార్చడంతోపాటు ధ్యానం చేయడానికి ప్రత్యేక మందిరం, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కుడా అధికారులు నిర్ధారణకు వచ్చారు. అనుకున్నదే తడవుగా భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న దీపం వద్దకు వెళ్లేందుకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 2007లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకుగాను రూ.2కోట్ల నిధులు కేటాయించారు. ధ్యాన మందిరం అభివృద్ధి పనులకు మరో రూ.3కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్‌లు సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి పంపగా మంజూరుకాలేదు. అలాగే 365 రోజుల పాటు చెరువు నిండా నీరు ఉండడంతో ఐల్యాండ్ కలగా మారింది.



హేమాచలుడి హుండీల ఆదాయం రూ.10 లక్షలు

మంగపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలోని కల్యాణ మంటపం వద్ద మంగళవారం భక్తులు వేసిన కానుకలను మంగళవారం లెక్కించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రవణపు సత్యనారాయణ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యలయం నుంచి వచ్చిన రాజశేఖర్ పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం ప్రారంభమైంది. 15 హుండీలలో మార్చి 27వ తేదీ నుంచి ఈ నెల 19 వరకు 57 రోజులు భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ, 10,26,410లు ఆదాయం సమకూరిందని ఈవో సత్యనారాయణ వెల్లడించారు. 10కి పైగా వెండి బంగారు ఆభరణాలు కూడా హుండీలలో భక్తులు వేశారన్నారు. వాటిని దేవస్థానం పెద్ద హుండీలోనే మిశ్రమ వెండి బంగారం తిరిగి అందరి సమక్షంలోనే భద్రపరుస్తామని ప్రత్యేకంగా వచ్చిన ఎండోమెంట్ జేఈవో సమక్షంలో తూకం వేయడం జరుగుతుందని తెలిపారు. ఇవి లెక్కలో లేవని వాటిని త్వరలో తెలియజేస్తామని అధికారులు ప్రకటించారు. లెక్కింపు పర్యవేక్షకులు రాజశేఖర్, ఈ.వో ఎస్. సత్యనారాయణ, ఆలయ ప్రధానార్చకుడు ముక్కమల్ల రాజశేఖర్‌శర్మ, విశ్రాంతి అర్చకుడు కైంకైర్యం రాఘావాచార్యులు, అర్చకులు పవన్‌కుమారచార్యులు, ఈశ్వర్‌చంద్‌శర్మ, అనిపెద్ది మురళికృష్ణశర్మ, వెంకటనారాయణశర్మ, రాజీవ్‌నాగశర్మ ఉత్సవ కమిటి ఛైర్మన్ యర్రంకాని సురేష్‌లతో పాటు సభ్యులు అర్చక ఉద్యోగులు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా మణుగూరు శ్రీవారి సేవకులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి 17 వరకు విజయవంతంగా నిర్వహించినందుకు అన్ని వర్గాల ప్రజలకు భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతులు తెలుపుతున్నట్లు ఛైర్మన్ సురేష్ తెలిపారు.




కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు చేపడుతున్న సిబ్బంది, మూల విరాట్

హేమాచలుడి ఆభరణాల తరలింపు

లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రం అడవి గుట్టలలో ఉండడం వల్ల స్వామివారి బంగారు ఆభరణాలు రక్షణ రిత్యా దేవాలయంలో ఉంచకుండా రక్షణ కలిగిన ప్రదేశాలకు దేవాదాయ ధర్మదాయశాఖ అధికారులు వరంగల్‌కు తరలించారు. ఈనెల 8 నుంచి 17 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతున్న క్రమంలో ఈ నెల 10 నుంచి 19వ, తేదీ వరకు ఆభరణా లను స్వామివారి మూలవిరాట్‌లోనే ఉంచిన దేవస్థానం అధికారులు మంగళవారం అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించి సంప్రదాయ బద్దంగా తొలగించారు. తొలగించిన ఆభరణాలను వెండి ఆభరణాలను వరంగల్ దేవాదాయ ధర్మదాయ శాఖ రక్షణ కార్యాల యానికి తరలించగా, బంగారు ఆభరణాలు మంగపేట యూనియన్ బ్యాంక్‌లో రక్షణ లాకర్‌లో వేసినట్లు దేవస్థాన ఈవో తెలిపారు.

వైన్స్ ఓపెన్.. చికెన్ సెంటర్స్ క్లోజ్

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని కాళేశ్వరంలో చికెన్ సెంటర్లు క్లోజ్ అయ్యాయి. సురపానమైన మద్యం షాపులు మాత్రం తెరిచి ఉన్నాయి. గతంలో చుక్క, ముక్కకు అలవాటు పడ్డ వారు చికెన్ సెంటర్లు ఎప్పుడు తెరుస్తారోనని ఎదురు చూస్తున్నారు.

మాతా శిశు కేంద్రం ఏర్పాటు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా తాత్కాలిక బస్టాండ్ వద్ద మహిళల సౌకర్యార్థం మాతా శిశు కేంద్ర, షీ గదిని అధికారులు ఏర్పాటు చేశారు. బాలింతలు పిల్లలకు పాలించేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ కేంద్రం ఏర్పాటుతో పాటు షీ రూమ్‌ల ఏర్పాటు పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ప్రారంభించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : సరస్వతి నది పుష్కరాల్లో భాగంగా వీఐపీ ఘాట్, టెంట్ సిటీ, ఆలయ పరిసర ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్యం పనులు చేపడుతున్నారు. పుణ్య స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కల్లకుండ పారిశుద్ధ్యం పనులు నిర్వహిస్తున్నారు. వ్యర్థాలను తొలిగిస్తు బ్లీచింగ్ చేపడుతున్నారు. వందల మంది పారిశుద్ధ్యం కార్మికులు నిత్యం శ్రమిస్తు పుణ్య స్నానాలకు వచ్చే భక్తులు రోగాల బారిన పడకుండా పనులు చేపడుతున్నారు.

ఆటోవాలాతో పోలీసుల వాగ్వాదం

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆటోను శ్రీపాద విగ్రహం వద్దనున్న మార్గం గుండ ప్రధాన ఆలయంలో మార్గం వైపు రాకుండా పోలీసులు అడ్డుకోవడంతో ఆటోవాలకు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. స్థానిక ఆటోలకు అనుమతి ఉన్నప్పటికి అడ్డుకోవడంతో ఆటో డ్రైవర్ తనను ఎందుకు పంపడం లేదంటూ పోలీసులను ప్రశ్నించాడు. దీంతో వారు ఏమ్ చేసుకుంటావో చేసుకో అంటూ ఆటోవాలతో మాట్లాడంతో మాటమాట పెరిగింది. రోజుకో విధంగా పోలీసులు వార్తల్లో నిలవడం పై పలు విమర్శలకు తావిస్తోంది.

హోటళ్లకు భలే గిరాకీ

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : సరస్వతి పుష్కరాల్లో భాగంగా కాళేశ్వరంకు వచ్చే భక్తులు మార్గ మధ్యలోని మహాదేవపూర్ వద్ద హోటల్లలో టిఫిన్ చేయడంతో అక్కడి హోటల్లు భక్తులతో కిటకిట లాడుతున్నాయి. సుదురు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మహాదేవపూర్ వద్ద ఆగి టిఫిన్లు, టీ కార్యక్రమాలు ముగించుకొని పుష్కర స్నానికి తరలి వస్తున్నారు. అలాగే దర్శనం అనంతరం తిరిగి వెళ్లే ప్రయాణికులు కూడ మహాదేవపూర్ వద్ద ఆగి ఆకలి, దప్పులు తీర్చుకుంటున్నారు.

మహిళా శిశు సంక్షేమశాఖ సేవలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి):సరస్వతి పుష్కరాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ తన వంతుగా సేవలందిస్తుంది. ప్రధాన పుష్కర ఘాట్ వద్ద ఐసీడీఎస్ అధికారులు స్టాల్ ఏర్పాటు చేసి 6 ఏళ్లలోపు పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారమైన బాలామృతం, మురుకులను అందిస్తున్నారు. వందలాదిమందికి ప్యాకెట్ల రూపంలో వాటిని పంపిణీ చేస్తూ ప్రీ స్కూల్ విద్య, అంగన్‌వాడీ కేంద్రాల సేవలను వివరిస్తున్నారు.

తాత్కాలిక రోడ్డు పనులు పూర్తి

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల్లో భాగంగా ఆదిముక్తేశ్వర స్వామి క్రాస్ రోడ్డు నుంచి వీఐపీ ఘాట్ వరకు తాత్కాలిక రోడ్డు పనులను పూర్తి చేశారు. గతంలో ఈ రోడ్డు పై స్వల్పంగా మాత్రమే కంకర పోసి ఉండడంతో పాటు భారీ వర్షం కురిస్తే వాహనాలు వెళ్లే పరిస్థితి లేక పోవడంతో ముందస్తు ఆలోచనతో అధికారులు రోడ్డు పనులను పూర్తి చేశారు. అలాగే ఈ రోడ్డు పై వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, ధూళీ లేవకుండ ట్యాంకర్‌తో నీటిని చల్లుతున్నారు.

ఎడ్ల బండి నుంచి హెలీకాప్టర్ దాకా!

అవసరాలకు ఉపయోగించుకుంటున్న పుష్కర భక్తులు



పుష్కర ఘాట్ వద్ద ఎడ్లబండ్లు, హెలీకాప్టర్ దృశ్యం

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి):సరస్వతీ పుష్కరాల్లో పలు రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పవచ్చు. పుష్కర స్నానానికి, శ్రీకాళేశ్వర-ముక్తీశ్వర స్వామి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తుల్లో వారి అభిరుచి, ఆర్థిక వెసులుబాటును అనుసరించి అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. పుష్కర స్నానం కోసం త్రివేణి సంగమానికి నడిచి వెళ్ల డానికి ఇబ్బంది పడే భక్తులకు సాంప్రదాయ ఎడ్లబండ్లు, కాళేశ్వర క్షేత్రం, త్రివేణిసంగమ విహంగ వీక్షణం చేయాలనుకునే భక్తులకు జాయ్ రైడ్ పేరిట హెలీకాప్టర్ సేవలు అందుబాటులో ఉన్నాయి. దీంతో భక్తులు పుష్కరాల్లో ఎడ్లబండ్లు మొదలుకుని హెలీకాప్టర్ దాకా ఉన్నాయంటూ వ్యాఖ్యానించడం విశేషం.

ప్రజలందరూ భక్తి భావాన్ని పెంపొందించాలి

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ భక్తి భావాన్ని పెంపొందించాలని, హనుమాన్ ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు కట్టపై కొలువుదీరిన దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బోనాల రాజమౌళిఉమదేవి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హనుమాన్ బిక్షకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై హనుమాన్ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

- చిట్యాల : మండల కేంద్రంలోని హనుమాన్ శోభాయాత్ర మంగళవారం తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. చింతల్లపల్లిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామంలోని పురవీధుల్లో స్వామి వారి చిత్రపటంతో ర్యాలీ తీశారు. హనుమాన్ వేషదారణలో రామనామ స్మరణ చేస్తూ ఊరేగింపు చేపట్టారు.



హనుమాన్ భిక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఈకార్యక్రమంలో హనుమాన్ భక్తులు అల్లం తిరుపతి, ఆకుల రాజు, వేణుసింగ్, పాముకుంట్ల రవి, కట్కూరి మొగిలి, కోడెల నరేష్, ఆకుల సాయిచరణ్, పెరుమాండల రాజు, బండి రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యా మెళకువలను మెరుగుపరుచుకోవాలి

చిట్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల విద్యా మెలకువలను మెరుగుపర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మండలంలోని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కోడెపాక రఘుపతి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఎల్.ఎఫ్.ఎల్ హెచ్ఎం, సెకండరీ గ్రేడ్ టీచర్లకు 5 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంఈవో రఘుపతి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిక్షణలో సమయ పాలన పాటించి, వృత్తి, విద్యాబోధన మెలకువలు మెరుగుపర్చుకోవాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్పీ కుసునపు కిరణ్‌కుమార్, ఆర్పీలు సదానందం, హరిప్రసాద్, చక్రపాణి, నాగరాజు, అనిల్‌కుమార్, వీరస్వామి, శ్రీనివాస్, మహేందర్, సీఆర్పీ తిరుపతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు వద్ద వాహనాల బారులు

కాటారం, మే 20(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంకుసాపూర్ సమీపంలో గల రైస్ మిల్లు కు పలు మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వడ్ల బస్తాల వాహనాలు బారులు తీరాయి. యాసంగి వరి ధాన్యం దిగుబడులు అధికంగా రావడంతో గత కొన్ని రోజులు గా కాంటాలు ముమ్మరమయ్యాయి. దీంతో నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు వడ్ల బస్తాలను రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. దీంతో వాహనాలు బారులు తీరడంతో అన్‌లోడింగ్ ఆలస్యం అవుతున్నదని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ఆధ్యాత్మికం..ప్రకృతి రమణీయం..!



ముక్తివనంలో సేద తీరుతున్న భక్తులు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి):కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ పుష్కరాలకు వస్తున్న వేలాది మంది భక్త జనంలో పలువురు ఆధ్మాత్మిక ఆనందం పొందడంతో పాటు ప్రకృతి రమణీయతల మధ్య ఆహ్లాదకరంగా సేదతీరుతున్నారు. కాళేశ్వరం శివారులో అటవీశాఖ ఆధ్వర్యంలో 353(సీ) జాతీయ రహదారి పక్కన అటవీప్రాంతంలో గత 8ఏళ్ల క్రితం కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన ముక్తివనం భక్తులను ఆకట్టుకుంటున్నది. పుష్కరాలకు తరలివచ్చే భక్తులు మండే ఎండలకు సేద తీరడానికి, ప్రకృతి రమణీయతతో విలసిల్లే వనంలో ఆహ్లాదకరంగా పర్యటిస్తున్నారు. ఎకో టూరిజంలో భాగంగా నిర్మించిన ముక్తి వనంలో ఏసీతో కూడిన సింగిల్ ట్రీ, డబుల్ ట్రీ హౌస్‌లు, నక్షత్ర వనం, పంచవటి వనం, స్మృతి వనం, రాశి వనం, నవగ్రహ వనం, సప్తరుషి వనం, బటర్ ఫ్లై గార్డెన్, లోటస్ పాండ్, పిల్లలు ఆట వస్తువుల స్థలాలు ఉన్నాయి. దీంతో పలు ప్రాంతాల నుంచి పుష్కరాలకు వస్తున్న భక్తులు తమ కుటుంబాలతో ముక్తి వనంలో ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తున్నారు. ముక్తివనం నిర్వాహకులు రూ.20టికెట్ వసూలు చేస్తున్నారు. వెడ్డింగ్ ఫోటో షూట్‌కు రూ.500-1000వరకు వసూలు చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో భక్తులు ముక్తివనాన్ని సందర్శించి సేదతీరడంతో పాటు ఫోటోలు తీసుకుంటు ఆనందంగా గడుపుతున్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలి



అంబేద్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న నాయకులు

కన్నాయిగూడెం , మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రముఖ న్యాయవాది కలకోటి మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఇటీవల తెలంగాణ చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో పోలీసుల జరిపిన ఎదురుకాల్పుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన సాదనపల్లి రవి అలియాస్ చందు కుటుంబాన్ని పరామర్శించారు. రవి కుటుంబ సభ్యులకు 5 వేల ఆర్థిక సహయంతో పాటుగా అంబేద్కర్ చిత్రపటాన్ని అందచేశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్ , ములుగు జిల్లా సాదన సమితి అధ్యక్షుడు ముంజాల బిక్షపతి గౌడ్ , రచయిత వెంకట్ పెరుమాళ్ల, రాష్ట్ర కళాకారుల సంఘం నాయకడు గోల్కొండ బుచ్చన్న , మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, రవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కాంటాలు కావడం లేదంటూ అన్నదాతల ఆందోళన

కాటారం, మే 20(ఆంధ్రజ్యోతి):మం డలంలోని రేగుల గూడెం గ్రామపంచా యతీ పరిధిలో ధాన్యం కొనుగో లు కేంద్రంలో కాంటాలు సక్రమంగా కావడం లేదంటూ మంగళ వారం పలువురు రైతు లు ఆందోళనకు దిగారు. గంగా రం క్రాస్ రోడ్డు వద్ద పలువురు రైతులు రాస్తారోకో చేపట్టారు. వరి కోతలు కోసి వడ్లను ఆరబెట్టి 20 రోజులవుతున్న కాంటాలు కావడం లేదని ఆరోపించారు. సెంటర్ నిర్వాహకులు తమకు నచ్చిన వారికే గన్నీ సంచు లు ఇచ్చి కాంటాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటువైపే ఉన్న ఎస్సై విషయం తెలుసుకుని రైతుల దగ్గరకు వెళ్లి మాట్లాడారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం అవుతాయని, రోడ్లపై కూర్చోవడం సరికాదని నచ్చజెప్పడంతో ఆందో ళన విరమించారు. ఆందోళనలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



ఆందోళన విరమించాలని రైతులతో మాట్లాడుతున్న ఎస్సై

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

కృష్ణకాలనీ, మే 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సీపీఎం పార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. కారల్‌మార్క్స్‌కాలనీలోని పార్టీ కార్యాలయం నుంచి గణేష్‌చౌక్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ప్రజా సంఘాలను కలుపుకొని ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నూరు రమేష్, పేదల సంఘం కార్యదర్శి వెలిశెట్టి రాజయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షరాలు వంగల విజయలక్ష్మీలు పాల్గొని మాట్లాడారు. నాలగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, కార్మికులక కనీస వేతనం నెలకు రూ. 26వేలు నిర్ణయిచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్. రవికుమార్, మహేందర్, తిరుపతి, రాజేందర్, కవిత, జ్ఞానేశ్వరి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

వాజేడు, మే 20(ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ వ్యాధి నిర్మూళన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోన పీహెచ్‌సీలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. ఆశా కార్యకర్తల సాయంతో గ్రామాల్లో క్షయ లక్షణాలతో ఉన్న వారిని గుర్తించి వారి నుంచి తెమడ పరీక్షలను నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం మొదలగు లక్షణాలు ఉన్న వారు క్షయ పరీక్షలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జ్ఞానస, హెచ్ఈవో వేణుగోపాలకృష్ణ, ఎస్‌టీఎల్ఎస్ రవి, టీబీ నోడల్ ఆఫీసర్ డీ శ్రీను, ఏఎన్ఎం శకుంతల, ఫార్మసీ ఆఫీసర్ సతీష్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

గోవిందరావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గల ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రజలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పస్రా సీఐ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని బుస్సాపూర్‌లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్సై కమలాకర్, గ్రామస్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మంగపేట, మే 20 (ఆంధ్రజ్యోతి) మంగపేట సహకార సంఘం కార్యలయంలో మండలంలోని రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటు ఉన్నాయని మంగపేట పీఏసీఎస్ సీఈవో సహమీర్ జగన్నాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండున్నర కిలోల బస్తా ఖరీదు రూ.2,150లు ఉందని, హెక్టార్‌కు ఒక బస్తా ఇవ్వబడునన్నారు. ఆసక్తిగల రైతులు పట్టాదార్ పాస్‌బుక్కు ఆధార్‌కార్డు జిరాక్స్ తప్పనిసరి ఇవ్వాలని, ఒక ఎకరం ఉన్న రైతులకు మాత్రం ఇవ్వబడదన్నారు. ఈ సదవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో ఆ ప్రకటనలో కోరారు.

విత్తన డీలర్లు నిబంధనలు పాటించాలి

చిట్యాల, మే 20 (ఆంధ్రజ్యోతి) : విత్తన, ఎరువులు, పురుగు మందుల విక్రయ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో పర్టిలైజర్స్, పెస్టీసైడ్స్ షాపుల యాజమానులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లపై వ్యవసాయ అధికారితో ధృవీకరించుకోవాలని, లైసెన్సు కలిగిఉన్న డీలర్లు మాత్రమే విత్తనాలు క్రయ, విక్రయాలు జరపాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈసమావేశంలో ఏఈవోలు రమణకుమార్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను వినియోగించుకోవాలి

ఏటూరునాగారం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు వృత్తిఅంతర శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి కొయ్యడ మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయులకు ఐదు రోజుల వృత్తిఅంతర శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల నుంచి 59 మంది ఉపాధ్యాయులు, 8 మంది మండల రిసోర్స్ పర్సన్స్(ఎంఆర్‌పీలు) హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మల్లయ్య మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ రవి, బాలాజీ, లవన్ కుమార్, ఎస్.బి నాయుడు, లావణ్య, సౌజన్య, రంజిత్ కుమార్, ఎస్.కె లయీమ్‌తో పాటు ఐదు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రమను దోచుకుంటున్న కేంద్ర ప్రభుత్వం

ములుగుటౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు రోజుకు కేవలం రూ. 600 చెల్లిస్తూ కేంద్ర ప్రభుత్వం వారిని శ్రమ దోపిడీకి గురిచేస్తుందని ఏఐటీయూసీ అనుబంధ సంఘం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన వర్కర్స్ సమావేశం నిర్వహించగా ఈ సమావేశానకి ముఖ్య అతిథిగా రవీందర్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 44 కోడ్‌లను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మికులు హక్కుల సాధన కోసం జులై 9న చేట్టనున్న సమ్మెలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు రాజు, రమ, రాజకుమారి, భారతి, పద్మావతి పాల్గొన్నారు.

సఖీ కేంద్రం పై ఉపాధి కూలీలకు అవగాహన

వాజేడు, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో మంగళ వారం ఉపాధి హామీ కూలీలకు సఖీ కేంద్రం పై అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రం లోని సఖీ కేంద్రం సభ్యురాలు వి.రాధ సఖి బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న వివిధ రకాల హింసల నుంచి రక్షణ కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలను ఏర్పాటు చేశాయన్నారు. మహిళలు, బాలికల కొరకు 181 హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారన్నారు. మహిళలకు అన్ని రకాల సహయాలను అందించడానికి సఖి కేంద్రం ఎల్లపుడూ ముందుటుందన్నారు.



కూలీలకు అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం సిబ్బంది

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన

వాజేడు, మే 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగారంలో ప్రభుత్వం వంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బిల్లం సుధాకర్ అనే లబ్ధిదారుడు ఇంటి నిర్మాణానికి హౌజింగ్ ఏఈ ఎండీ ఇషాక్ హుస్సేన్ మంగళవారం పనులు ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన కొలతల ఆదారంగా ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు ఇండ్లను నిర్మించుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం ఆధారంగా బిల్లులు కూడా ఆకౌంట్‌లలో జమ అవుతున్నాయన్నారు. జీపీ కార్యదర్శి చాట్ల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

కృష్ణకాలనీ, మే 20 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని భూపాలపల్లి ఎస్సై సాంబమూర్తి అన్నారు. జిల్లా స్థాయి సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిచారు. ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై ప్రతీ విద్యార్థికి అవగాహన కల్పిచినట్లయితే గ్రామీణ ప్రాంతాలలోని వారి కుటుంబ సభ్యులకు కూడా సైబర్ నేరాల బారీన పడకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ రమేష్, ఆర్పీలు పోతర్ల సతీష్, గుగులోతు రామదన్, హోలీపాషా, సుదాకర్ తదితరుల పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి రిమాండ్

టేకుమట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన వీరముష్టి ప్రేమ్‌దాసుకు 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పంగిడిపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్ తన దగ్గరి బంధువైన గౌడ సమ్మయ్యతో పొలానికి వెళ్లే దారి విషయంలో ఘర్షణ జరిగినట్లు తెలిపారు. కాగా ఘర్షణలో భాగంగా ప్రేమ్‌దాస్ గౌడ సమ్మయ్యతో పాటు, అతడి భార్య, అతడి ట్రాక్టరు డ్రైవర్ అశోక్‌పై దాడి చేసిన విషయంలో గత నెల 14న హత్యయత్నం కేసు నమోదు అయినట్లు తెలిపారు. కాగా మంగళవారం పరారీలో ఉన్న నిందితుడిని పరకాల కోర్టులో హజరుపరచడంతో అతనికి 14 రోజుల రిమాండ్‌ను విధించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

రైతులకు మేలైన విత్తనాలు విక్రయించాలి

ఏటూరునాగారం, మే 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు విత్తనాలు విక్రయించాలని ఏటూరునాగారం డివిజన్ ఉప సహాయ సంచాలకులు(ఏడీఏ) అవినాశ్ వర్మ అన్నారు. విత్తనం, ఎరువుల, పురుగు మందుల చట్టాలపై మండలంలోని ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ అవినాశ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు మేలు రకం విత్తనాలను మాత్రమే విక్రయించాలని, విక్రయించిన ప్రతి విత్తనానికి తగిన రసీదులను రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల బారిన పడకుండా ఉండడానికి ఇది అత్యంత కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి(ఏవో) వేణుగోపాల్, ఏఈవోలు రవి కుమార్, రాజుతో పాటు డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ అవినాశ్